సాక్షి
మెదక్
బుధవారం । 9 । జూలై । 2025



నిరవధిక సమ్మెకు సిద్ధం
తమ డిమాండ్ల పరిష్కరించాలంటూ ఈ నెల 14 నుంచి ఆర్టిజన్లు నిరవధిక సమ్మెకు దిగనున్నారు. వివరాలు 8లో ▸



టమాటా రైతులకు ఊరట
టమాటా రైతులు కొద్దిరోజులుగా ధరపెరుగుతుండటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. వివరాలు 8లో ▸



రైతుల నిరసన
విద్యుత్ అంతరాయంతో బ్యాంకు సేవలు అందక రైతులు ఆందోళనకు దిగారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

నిబంధనలు పాటించాలి



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న బీఎల్‌ఓలతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి మహిపాల్

నర్సాపూర్: బూత్ లెవెల్ ఆఫీసర్లు ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనలను పకడ్బందీగా పాటించాలని స్థానిక ఆర్‌డీఓ, నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మహిపాల్ సూచించారు. నర్సాపూర్‌లోని వైపర్ కాలేజీ ఆడిటోరియంలో మంగళవారం ఏర్పాటు చేసిన మండలంలోని బూత్ లెవెల్ ఆఫీసర్ల శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఎల్‌ఓలు తమకు కేటాయించిన బూత్ పరిధిలో కమిషన్ నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ మహేశ్, ఆర్‌ఐ ఫైజల్, ట్రైనర్లు లక్ష్మినారాయణ, ప్రసన్నకుమార్, శ్రీనివాస్‌యాదవ్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు జిల్లా జట్టు



మంచిర్యాలకు బయల్దేరిన ఫుట్‌బాల్ జట్టు

మెదక్ మున్సిపాలిటీ: ఈ నెల 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకు మంచిర్యాలలో జరగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల ఫుట్‌బాల్ పోటీలకు జిల్లా జట్టు సభ్యుడు మంగళవారం మెదక్ నుంచి తరలివెళ్లారు. మెదక్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులు తరలివెళ్లారు. ఈ జట్టుకు కోచ్‌గా జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారిణి పి.భాగ్యమ్మను నియమితులయ్యారు.

ఎన్యూమరేటర్లకు పారితోషికం చెల్లించాలి



మాట్లాడుతున్న కాశీనాథ్ జాదవ్

నారాయణఖేడ్: గతేడాది సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన ఎన్యూమరేటర్లకు పారితోషికాన్ని చెల్లించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు కాశీనాథ్ జాదవ్ డిమాండ్ చేశారు. సంఘం సభ్యత్వ నమోదులో భాగంగా మంగళవారం ఖేడ్ మండలంలోని పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేచేసి 8 నెలలు గడుస్తున్నా పారితోషికాన్ని చెల్లించకపోవడం విచారకరమన్నారు. పీఆర్సీ రిపోర్టును తెప్పించుకుని అమలు చేయాలని, పెండింగ్ డీఏలను విడుదల చేయాలని కోరారు. సీపీఎస్ విధానాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. గురుకులాల టైంటేబుల్ మార్చాలని, కేజీబీవీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి వారికి కనీస వేతనం ఇవ్వాలని కోరారు. పాఠశాలల పర్యవేక్షణకోసం ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలన్నారు. సంఘ ఖేడ్ మండల ప్రధానకార్యదర్శి శ్రీరామ్‌నాయక్, నాయకులు గంగామోహన్, మంగుబాయి, శోభారాణి, శంకర్‌రావు పాల్గొన్నారు.

ప్రతి మహిళా కోటీశ్వరులు కావాలి

సంగారెడ్డి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రమేశ్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్ బాబు

ఝరాసంగం(జహీరాబాద్): మహిళా సంఘాల్లోని ప్రతీ మహిళా కోటీశ్వరుల్ని చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రమేష్ బాబు స్పష్టం చేశారు. మండల కేంద్రమైన ఝరాసంగం పేదరిక నిర్మూలన సంస్థ కార్యాలయంలో మంగళవారం ఇందిరా మహిళా సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మహిళా ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు ముందుకు రావాలన్నారు. ప్రభుత్వం అందించే ప్రతీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీయం టిక్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

భూ పరిష్కారం షురూ!

- భూ భారతిలో దరఖాస్తు చేసిన అర్జీదారులకు రశీదులు
- త్వరలో క్షేత్రస్థాయిలో భూముల పరిశీలన
- పైలట్ ప్రాజెక్టుగా చిలప్‌చెడ్‌లో 118 దరఖాస్తుల పరిష్కారం

భూసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూ భారతిలో స్వీకరించిన దరఖాస్తుల పరిశీలనకు అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది. దరఖాస్తులు ఇచ్చిన రైతులకు క్షేత్రస్థాయిలో భూముల పరిశీలను రెవెన్యూ అధికారులు సమాచారం ఇస్తున్నారు. త్వరలో క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించనుండగా పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన చిలప్‌చెడ్ మండలంలో ఇప్పటికే ఆ దిశగా అడుగులు పడ్డాయి.



ఇటీవల భూ భారతి సదస్సులో అర్జీ తీసుకుంటున్న కలెక్టర్ రాహుల్(ఫైల్)

మెదక్‌జోన్: జిల్లా వ్యాప్తంగా 37,817 మంది రైతులు భూ భారతిలో దరఖాస్తులు చేశారు. ప్రతీ దరఖాస్తుదారుడికి ప్రత్యేకంగా ఓ నంబర్ ఇచ్చి రశీదులను ఇచ్చారు. వీటన్నింటినీ ఆన్‌లైన్‌లో పొందుపరిచిన అధికారులు వాటిలో ఎలాంటి దరఖాస్తులకు ముందస్తుగా పరిష్కరించాలని దానిపై అధికారులు కసరత్తు చేస్తునట్లు తెలిసింది. క్షేత్రస్థాయిలో భూములను స్వయంగా పరిశీలించేందుకు అధికారులు రైతులకు సమాచారమిస్తున్నారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనకు తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్‌ఐలతోపాటు నూతనంగా ఎంపిక చేసిన సర్వేయర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్కడ పరిస్థితులను బట్టి కొలతలు వేసి రైతుల వద్దనున్న భూ పత్రాలను స్వయంగా పరిశీలించనున్నారు. అనంతరం గ్రామస్తుల సమక్షంలో భూ సమస్యలను పరిష్కరించనున్నట్లు ఓ ఉన్నతాధికారి తెలిపారు.

అత్యధికంగా ...

జిల్లాలో 37 వేల దరఖాస్తులు రాగా వాటిలో అతి క్లిష్టమైనవి మిస్సింగ్ సర్వేనంబర్లు, విస్తీర్ణంలో తేడాలు, పట్టాదారు పేరులో తప్పిదాలు, ఒకరి పట్టా భూమి మరొకరిపై పట్టాచేయటం, లావాణి పట్టాభూముల్లో అన్నదమ్ములకు పంపిణీ చేయటం , విస్తీర్ణంలో వ్యత్యాసం తదితర దరఖాస్తులు అధికంగా ఉన్నాయి.

పైలట్ ప్రాజెక్టు మండలంలో

కాగా, జిల్లాలో భూ భారతిని పైలట్ ప్రాజెక్టుగా చిలప్‌చెడ్ మండలాన్ని ఎంపిక చేసి ముందస్తుగా ఆ మండలంలో దరఖాస్తులను స్వీకరించారు. ఆ మండలంలో మొత్తం 1,045 దరఖాస్తులు రాగా వాటిలో ఇప్పటివరకు 118 దరఖాస్తులను పరిష్కరించినట్లు తెలిసింది.

త్వరలో క్షేత్రస్థాయి పరిశీలన...!



భూ భారతిలో రైతులనుంచి దరఖాస్తులు చేసుకున్న రైతులకు సమాచారం ఇచ్చాం. త్వరలో క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తాం. అవసరమైన చోట ప్రభుత్వం నియమించిన సర్వేయర్లతో భూములను సర్వేచేసి సమస్యలను పరిష్కరిస్తాం.
–మెంచు నగేశ్, అదనపు కలెక్టర్, మెదక్

పకడ్బందీగా సంక్షేమ పథకాలు

కలెక్టర్ రాహుల్‌రాజ్



ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

రేగోడ్(మెదక్): మారుమూల గ్రామాల్లో అర్హులందరికీ సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు జరిగేలా కృషి చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. మండలంలోని సిందోల్, టి.లింగంపల్లి, తాటిపల్లి గ్రామాల్లో మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, నిర్మాణాలు, పారిశుద్ధ్యం పనులను పరిశీలించారు. ఇతర సంక్షేమ పథకాల మంజూరు తీరును అడిగి తెలుసుకున్నారు. ఆయా పాఠశాలలను తనిఖీ చేసి పాఠశాలల్లోని సమస్యలు, ఉపాధ్యాయుల పనితీరును అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో దశల వారీగా ప్రభుత్వం నగదును జమ చేస్తుందన్నారు.

పరిశుభ్రత పాటించాలి

ఇళ్ల పరిసరాల్లో పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు రాకుండా ఉంటాయని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి కాలానుగుణ జ్వరాలకు దారితీసే డ్రెయిన్ వాటర్ నిల్వ వంటి సమస్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. దీని నివారించడానికి ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని, దోమల లార్వాలను నివారించడానికి అన్ని పాత గోళాలు ఖాళీ చేయడం ముఖ్యమని చెప్పారు. ఏవైనా జ్వరాలు, ఇతర సీజనల్ వ్యాధులు వస్తే ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చికిత్సలు చేయించుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి, భవన నిర్మాణ పనుల్లో పురోగతి సాధించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి కలెక్టర్ తన చాంబర్‌లో విద్యా సంక్షేమ మౌలిక సదుపాయాల సంస్థ, ఇంజనీరింగ్, పంచాయతీరాజ్, విద్యా శాఖ విభాగాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పురోగతి ఉన్న పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలన్నారు. సమావేశంలో డీఈఓ రాధాకిషన్, పంచాయతీరాజ్ ఈఈ నరసింహులు, విద్యా సంక్షేమ మౌలిక వసతుల సంస్థ ఈఈ శ్రీనివాస్ రెడ్డి, డీఈ నరసింహచారి, జేఈలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల హృదయాల్లో సజీవం

నర్సాపూర్: మాజీ ముఖ్యమంత్రి దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి భౌతికంగా లేకపోయినా ప్రజల హృదయాల్లో సజీవంగా ఉన్నారని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ పేర్కొన్నారు. మహానేత వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని పిల్లల పార్కులో ఆయన విగ్రహానికి పలువురు కాంగ్రెస్ నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన పేదలు, రైతుల పక్షపాతిగా పేరు గడించారని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి, సొసైటీ చైర్మన్ రాజుయాదవ్, పార్టీ నాయకులు రిజ్వాన్, మల్లేష్, రవీందర్‌రెడ్డి, చిన్న ఆంజిగౌడ్, నరేందర్‌రెడ్డి, విశ్వంబరస్వామి, రషీద్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

హన్మంతాపూర్‌లో ఇండ్లకు పూజలు

నర్సాపూర్ మున్సిపాలిటీలోని హన్మంతాపూర్‌లో మంగళవారం డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి పలువురు పార్టీ నాయకులతో కలిసి ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజలు చేశారు.



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్

ప్రకృతి, సేంద్రియ సాగు చేయాలి

తునికి కేవీకేలో ఎస్సీ రైతుల శిక్షణ కార్యక్రమంలో ఎన్‌ఏఏఆర్‌ఎం డైరెక్టర్ డాక్టర్ గోపాల్‌లాల్

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రతి రైతు తప్పనిసరిగా ప్రకృతి, సేంద్రియ వ్యవసాయం చేయాలని ఎన్ఏఏఆర్ఎం డైరెక్టర్ డాక్టర్ గోపాల్‌లాల్ తెలిపారు. మంగళవారం మండలంలోని తునికివద్దగల డాక్టర్ డి.రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో ఎస్సీ రైతులకు ప్రకృతి, సేంద్రియ వ్యసాయంపై ఐదు రోజులు శిక్షణ కార్యక్రమం నిర్వహించగా ముగింపు కార్యక్రమానికి ఎన్ఏఏఆర్ఎం (నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసర్చ్ మేనేజ్‌మెంట్) డైరెక్టర్ డాక్టర్ గోపాల్‌లాల్ ముఖ్యఅతిధిగా హాజరైయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు ఆరోగ్యం కోసం ప్రకృతి, సేంద్రియ సాగు చేయాలన్నారు. రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు మోతాదుకు మించి వాడటంతో భూమి, ఆహార ఉత్పత్తులు కలుషితం అవుతున్నాయని చెప్పారు. ప్రకృతి, సేంద్రియ సాగుతో భూమి, ఆహార పంటలు బాగుంటాయని చెప్పారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఈసందర్భంగా శిక్షణ పొందిన తునికి, రాయిలాపూర్, పోతిరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన 40మంది ఎస్సీ రైలులకు శిక్షణ సర్టిఫికెట్, బ్యాగ్, ప్రకృతి వ్యవసాయానికి ఉపయోగపడే పంచగవ్య, వావిలాకు కషాయం, వానపాముల ఎరువుతో పాటు జీవాంమృతం తయారికి డ్రమ్ములు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఏఏఆర్ఎం సైంటిస్ట్ డాక్టర్ బాలకృష్ణ, కేవీకే హెడ్ అండ్ సైంటిస్ట్ శంభాజీదత్తాత్రేనల్కర్, శాస్త్రవేత్తలు రవికుమార్, శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, శ్రీకాంత్, ఉదయ్‌కుమార్, భార్గవి తోపాటు రైతులు పాల్గొన్నారు.



తునికి కేవీకేలో శిక్షణ పొందిన ఎస్సీ రైతులతో ఏఎన్ఏఏఆర్ఎం, కేవీకే శాస్త్రవేత్తలు

సిగాఛీ.. నిబంధనల్ని కాలరాసి

క్యాజువల్ లేబర్‌తో పనులు చేయించింది

- ఈ లేబర్‌ను సరఫరా చేసిన కాంట్రాక్టర్లకు లైసెన్సే లేదు
- ఒకొక్కటిగా వెలుగులోకి వస్తున్న 'సిగాచీ' యాజమాన్యం ఆగడాలు
- మొక్కుబడి తనిఖీలకే పరిమితమైన కార్మికశాఖ అధికారులు
- ప్రమాదం జరిగాక నోటీసులు జారీ

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: కనీస భద్రతా ప్రమాణాలు పాటించకుండా 44 మంది నిరుపేద కార్మికుల ప్రాణాలను బలిగొన్న సిగాచీ పరిశ్రమ యాజమాన్యం..ఇటు కార్మిక చట్టాలను కూడా కాలరాసింది. రియాక్టర్లు, బాయిలర్లు..వంటి కీలక యంత్రాల వద్ద సంబంధిత రంగాల్లో అన్ని అర్హతలున్న స్కిల్డ్ వర్కర్లతో పనిచేయించాల్సిన యాజమాన్యం అడ్డాకూలీ (క్యాజువల్ లేబర్)తో పరిశ్రమల్లో పనిచేయించినట్లు తేలింది. పైగా ఈ పరిశ్రమకు ఈ అడ్డాకూలీలను ఇద్దరు లేబర్ కాంట్రాక్టర్లు సరఫరా చేశారు. అయితే ఈ కాంట్రాక్టర్లు ఇద్దరికీ కూడా కార్మిక శాఖ నుంచి కనీసం లైసెన్స్‌లు లేవని తేలింది. దీన్ని బట్టి చూస్తే అన్‌స్కిల్డ్ వర్కర్లతో కీలక యంత్రాల వద్ద పనులు చేయించడంతోపాటు, కనీస నిబంధనలు పాటించలేదనేది స్పష్టమవుతోంది. అన్ని అర్హతలున్న వారిని ఉద్యోగాల్లో నియమించుకుంటే అధికంగా వేతనాలు ఇవ్వాల్సి ఉంటుందని కక్కుర్తి పడి అడ్డాకూలీలతో పనిచేయించినట్లు తేలింది.

85 మంది రోజువారీ కూలీలు, వర్కర్లే..

నిరుపేద కూలీల ప్రాణాలు గాలిలో కలిశాక కార్మిక శాఖ మేల్కొంది. పొట్టచేతపట్టుకుని ఉత్తరాది రాష్ట్రాల నుంచి వలస వచ్చిన అమాయక కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాక ఈ శాఖ అధికారులు మొద్దునిద్ర వీడారు. ప్రమాదం జరిగాక ప్రభుత్వానికి ఆశాఖ ఓ నివేదిక పంపింది. ఈ నివేదిక ప్రకారం.. ప్రమాదం జరిగినప్పుడు మొత్తం 143 మంది కార్మికులు, ఉద్యోగులున్నట్లు అధికారులు ప్రకటించారు. ఇందులో 85 మంది డెయిలీ వేజ్ లేబరే ఉన్నట్లు నివేదికలో పేర్కొన్నారు. 32 కంపెనీ ఉద్యోగులు ఉండగా, 26 మంది కాంట్రాక్టు వర్కర్లు ఉన్నట్లు గుర్తించారు.

లైసెన్స్‌లేని కాంట్రాక్టర్ ద్వారా కూలీలు..

ఈ దుర్ఘటన జరిగిన నెలలో జూన్‌లో ఈ పరిశ్రమలో పని ఎక్కువగా ఉందని, ఇందుకోసం రోజువారీ కూలీలతో పనులు చేయించాలని పరిశ్రమ యాజమాన్యం నిర్ణయించింది. ఇందుకోసం 20 మంది రోజు కూలీలను సరఫరా చేసేందుకు ఒక లేబర్ కాంట్రాక్టర్, పది మంది కూలీలను సరఫరా చేసేందుకు మరో లేబర్ కాంట్రాక్టర్‌తో పరిశ్రమ యాజమాన్యం మాట్లాడుకున్నట్లు కార్మికశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ క్యాజువల్ లేబర్‌ను సరఫరా చేస్తున్న ఈ ఇద్దరు లేబర్ కాంట్రాక్టర్లకు కార్మిక శాఖ నుంచి ఎలాంటి లైసెన్స్ లేకపోవడం గమనార్హం. అంటే కనీసం లైసెన్స్ ఉన్న కాంట్రాక్టర్ ద్వారా కూడా రోజువారీ కూలీలను పనిలో పెట్టుకోలేదంటే ఈ పరిశ్రమ యాజమాన్యం అలసత్వం ఏమేరకు ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

సిగాచీ పరిశ్రమకు ఎన్‌డీఎంఏ

ప్రమాద స్థలం అధ్యయనం

పటాన్‌చెరు: ఇటీవల భారీ ప్రమాదం జరిగిన పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచీ ఫార్మా పరిశ్రమను మంగళవారం జాతీయ విపత్తు నివారణ సంస్థ (ఎన్‌డీఎంఏ) బృందం సందర్శించింది. ఈ బృందం సభ్యులు ప్రమాద స్థలాన్ని నిశితంగా పరిశీలించి అణువణువూ గాలించారు. ప్రమాద వివరాలను ఆ సమయంలో కొనసాగుతున్న ఉత్పత్తి తదితర అంశాలను సుదీర్ఘంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్‌డీఎంఏ కేంద్ర బృందం కమిటీ సభ్యులు, సిగాచీ పరిశ్రమలో ప్రమాదం జరగడానికి గల కారణాలపై అధ్యయనంతో పాటు పరిశ్రమలో జరిగిన భారీ ప్రమాదానికి గల కారణాలు ఇటువంటి ఘటనలు భవిష్యత్తులో ఏ పరిశ్రమల లోనూ పునరావృతం కాకుండా చేపట్టాల్సిన చర్యలపై కేంద్రప్రభుత్వ నిర్వహణ సంస్థ కమిటీ సభ్యులు సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఘటన జరిగిన తీరును బృందం సభ్యులకు వివరించారు. ప్రమాదం జరిగిన తర్వాత చేపట్టిన సహాయక చర్యలను కమిటీ సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోశ్ పంకజ్, పరిశ్రమలశాఖ, అగ్ని మాపకశాఖ, కార్మికశాఖ, పోలీసు, రెవెన్యూశాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రమాద స్థలాన్ని పరిశీలించి, వివరాలు తెలుసుకుంటున్న ఎన్‌డీఎంఏ బృందం

కనీస సమాచారం లేదు..

ఈ ఫ్యాక్టరీని ఇటీవల నిజామాబాద్ జిల్లా కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ యాదయ్య తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా కార్మికులతో పని చేస్తున్న విషయాన్ని యాదయ్య తాను ఆశాఖ ఉన్నతాధికారులకు ఇచ్చిన నివేదికలో పేర్కొనకపోవడం గమనార్హం. కేవలం కార్మికుల సంఖ్య, షిఫ్టులు, వంటి వివరాలు డిస్‌ప్లేబోర్డుపై పెట్టలేదని మాత్రమే నివేదికలో రాసానని యాదయ్య 'సాక్షి'తో పేర్కొన్నారు.

10ఏ కింద నోటీసులు జారీ..

ఈ ప్రమాదం జరిగాక సిగాచీ పరిశ్రమ యాజమాన్యానికి సెక్షన్ 10–ఏ కింద నోటీసులు జారీ చేసినట్లు కార్మికశాఖ సంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ రవీందర్‌రెడ్డి 'సాక్షి'తో పేర్కొన్నారు. యా–1 ఫాంలో కార్మికులు, ఉద్యోగుల వివరాలివ్వాలని యాజమాన్యానికి డిప్యూటీ కమిషనర్ కార్యాలయం లేఖ రాసింది.

మున్సిపాలిటీల్లో వార్డు కార్యాలయాలు

- తొలుత నాలుగు మున్సిపాలిటీల పరిధిలో ఏర్పాటుకు కసరత్తు
- జిల్లాలో మొత్తం 75 వార్డుల్లో కార్యాలయాలు ఏర్పాటయ్యే అవకాశం
- తీరనున్న ప్రజల ఇబ్బందులు
- పరిపాలన మరింతగా ప్రజలకు చేరువయ్యే అవకాశం

ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలు చేయడం , పరిపాలనను ప్రజలకు మరింతగా చేరువ చేయడానికిగాను మున్సిపాలిటీల పరిధిలో వార్డు కార్యాలయాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు అన్ని మున్సిపాలిటీల్లో ఈ కార్యాలయాలు ఏర్పాటైతే ఆయా వార్డుల పరిధిలో ప్రజల ఇబ్బందులు తీరనున్నాయి. వార్డు పరిధిలోనే ప్రజలకు అన్ని రకాల సేవలు అందే అవకాశం ఉంటుంది. ఈమేరకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

రామాయంపేట(మెదక్): జిల్లాలో మెదక్, తూప్రాన్, నర్సాపూర్, రామాయంపేట మున్సిపాలిటీలున్నాయి. వీటి పరిధిలో మొత్తం 75 వార్డులున్నాయి. ఇప్పటికే వార్డుకు ఒక అధికారి చొప్పున కొనసాగుతున్నారు. వీరు మున్సిపల్ కార్యాలయంనుంచే విధులు నిర్వర్తిస్తున్నారు. వార్డు అధికారులు వార్డుల్లోకి సక్రమంగా రావడంలేదని, వారు కార్యాలయానికే పరిమితమయ్యారనే ఆరోపణలున్నాయి. కొత్తగా ఆయా వార్డుల్లో కార్యాలయాలు ఏర్పాటు చేస్తే సదరు అధికారి వార్డు పరిధిలోనే విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ప్రజలకు అందుబాటులో ఉండటంతోపాటు ప్రజలకు అన్ని రకాల సేవలందే అవకాశం ఉంటుంది.

పాలన మరింతగా చేరువ

వార్డు కార్యాలయాలు ఏర్పాటైతే ప్రజలకు పాలనా సౌలభ్యం అందుబాటులో ఉంటుంది. చాలావరకు సమస్యలు సకాలంలో పరిష్కారమయ్యే అవకాశం కలుగుతుంది. ఆయా వార్డులకు చెందిన ప్రజలు పనుల నిమిత్తం మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే అవసరం ఉండదు. కాగా, వార్డుల్లో కార్యాలయాల ఏర్పాటు అంత సులభం కాదనే అభిప్రాయం నెలకొంది. కొత్తగా కార్యాలయం, ఫర్నీచర్, కంప్యూటర్ల ఏర్పాటు, తదితర అంశాలు ఖర్చుతో కూడుకుని ఉంటాయి. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే తప్ప ఈ సమస్యలు పరిష్కారం కావు.



మెదక్ మున్సిపల్ కార్యాలయం

వార్డు కార్యాలయాల ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలు

- మున్సిపాలిటీల పరిధిలో వార్డు కార్యాలయాలు ఏర్పాటైతే ప్రజలకు పౌరసేవలు అందుబాటులో ఉంటాయి.
- జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఇతరత్రా పత్రాలు పొందడం సులభతరమవుతుంది.
- ఇంటిపన్ను, నీటి బిల్లులు వార్డు కార్యాలయాల్లోనే చెల్లించే అవకాశం ఉంటుంది.
- తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావడానికి వార్డు కార్యాలయం ఒక వేదికగా పనిచేస్తుంది.
- వీధి దీపాలు, పారిశుద్ధ్యం, తాగునీరు, వంటి ఇతర సమస్యలు వార్డు కార్యాలయాల ద్వారానే పరిష్కరించుకునే అవకాశం ఉంటుంది.
- కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలను వార్డు స్థాయిలో ప్రజలకు వివరించి వారికి అవసరమైన సహాయ సహకారాలు అందజేసే అవకాశం కలుగుతుంది.
- వార్డు కార్యాలయాల ద్వారా ప్రజలకు మరిన్ని సేవలందుబాటులోకి వస్తాయి.
- ప్రభుత్వ నిర్ణయాలు, కొత్త పథకాలు, ఇతర ముఖ్యమైన సమాచారాన్ని వార్డు కార్యాలయాలద్వారా ప్రజలకు త్వరితగతిన చేరవేసే అవకాశం ఉంటుంది.

ప్రజలకు సౌలభ్యంగా ఉంటుంది



వార్డు కార్యాలయాల ఏర్పాటు నిర్ణయం మంచిది. కార్యాలయాలు ఏర్పాటైతే అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉంటారు. చాలా వరకు సమస్యలు వార్డు కార్యాలయాల్లోనే పరిష్కారమవుతాయి.
–దేవేందర్, మున్సిపల్ చైర్మన్, రామాయంపేట

బూత్ లెవల్ అధికారుల పాత్ర కీలకం

ఆర్డీఓ రమాదేవి



మాట్లాడుతున్న ఆర్డీఓ రమాదేవి

పాపన్నపేట(మెదక్): ఓటర్ జాబితా తయారీలో బూత్ లెవల్ అధికారులదే కీలక పాత్ర అని మెదక్ ఆర్డీఓ రమాదేవి పేర్కొన్నారు. పాపన్నపేట ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన బూత్ లెవల్ అధికారుల శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...తమకు కేటాయించిన పోలింగ్ స్టేషన్ పరిధిలోని ఇళ్లను సర్వే చేసి, కొత్త ఓటర్లను నమోదు చేయాలని సూచించారు. ఓటరు జాబితాలో తప్పులు ఉంటే,సరిదిద్దాలని చెప్పారు. అన్ని రకాల సమాచారాన్ని యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్, డిప్యూటీ తహసీల్దార్ చరణ్, ఆర్ఐ నాగరాజు, మాస్టర్ ట్రైనర్ సత్యానారయణరెడ్డి, వరప్రసాద్, అంజాగౌడ్, నర్సింలు, దేవిసింగ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఫోన్ కొనివ్వలేదని అలిగి...


ఆసిఫ్

చేగుంట(తూప్రాన్): ఫోన్ కొనివ్వలేదని అలిగిన ఓ విద్యార్థి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఎస్‌ఐ చైతన్యకుమార్ రెడ్డి కథనం ప్రకారం.. చేగుంటకు చెందిన షేక్ ఆసిఫ్ (16) తనకు ఫోన్ కొనివ్వాలని తల్లిదండ్రులను కోరాడు. వారు నిరాకరించడంతో అలిగిన ఆసిఫ్.. ఈనెల 4న ఎవరికీ చెప్పకుండా ఇంట్లోంచి వెళ్లిపోయాడు. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి షాదుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ నవీన్

చేర్యాల(సిద్దిపేట): గంజాయి విక్రయిస్తున్న యువకుడిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ వి.నవీన్ తెలిపాడు. మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి శివారు కటికె బండ వద్ద ఓ యువకుడు గంజాయి విక్రయిస్తున్నాడని విశ్వసనీయ సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్ ఫోర్స్, చేర్యాల పోలీసులు దాడి చేసి సోహెల్ పాషాను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి 115 గ్రాముల గంజాయి, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపాడు. విచారించగా హైదరాబాద్ దూల్పేటలో గుర్తుతెలియని వ్యక్తి నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపాడు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపాడు.

మందుబాబులకు జరిమాన

సంగారెడ్డి క్రైమ్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా న్యాయస్థానం జరిమాన విధించింది. సంగారెడ్డి ట్రాఫిక్ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి పట్టణంలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తా, పాత బస్టాండ్ వద్ద, బైపాస్‌లోని గుర్రపు బొమ్మ వద్ద నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ఏడు మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఆయన చెప్పారు. వారిని మంగళవారం సంగారెడ్డి జిల్లా న్యాయస్థానంలో హాజరుపరచగా జిల్లా అదనపు న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్దిఖీకి రూ. రెండు వేలు, ముగ్గురికి రూ.1500, మిగతా ముగ్గురికి రూ.1000, చొప్పున జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో మూడు గేదెల మృత్యువాత



పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం రుద్రారంలోని పెద్ద చెరువులో మంగళవారం విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృత్యువాత పడ్డాయి. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే తన గేదెలు మృతి చెందాయని, రూ. 4లక్షలు నష్టపోయానని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు మహేశ్ కోరాడు. చెరువులో విద్యుత్ స్తంభాలు ఉండటమే తరచూ గేదెలు మృత్యువాత పడుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

రూ.87.94 లక్షల వడ్డీలేని రుణాలు

ఐకేపీ ఏపీఎం రుక్మిణి

తూప్రాన్: మండల మహిళా సమైఖ్యకు ప్రభుత్వం రూ.87.94 వడ్డీలేని రుణాలను మంజూరు చేసిందని ఐకేపీ ఏపీఎం రుక్మిణి పేర్కొన్నారు. మంగళవారం మహిళా శక్తి సంబురాలు కార్యక్రమం నిర్వ హించారు. ఈ సంబురాలు గ్రామాల వారీగా ఈనె ల 18వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే గ్రామాల్లో మహిళ సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా పురోగతి సాధిస్తున్నట్లు తెలిపారు.

నిరవధిక సమ్మెకు సిద్ధం

14 నుంచి ఆర్టిజన్ కార్మికుల ఆందోళన బాట

- ఆర్టిజన్స్ కన్వర్షన్‌తోనే ఉద్యోగ భద్రత, ఆత్మగౌరం
- జిల్లా వ్యాప్తంగా పోస్టర్ల ఆవిష్కరణ


వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్టిజన్ కార్మికులు

జహీరాబాద్: తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆర్టిజన్ కార్మికులు నిరవధిక సమ్మెకు సిద్ధం అవుతున్నారు. ఈనెల 14వ తేదీ నుంచి సమ్మెకు పోతున్నట్లు టీవీఏసీ–జేఏసీ ప్రకటించింది. సమ్మెకు శాశ్వత ఉద్యోగులు సైతం సహకరించాలని కోరింది. విద్యుత్ ఉత్పత్తి నుంచి బిల్లుల వసూళ్ల వరకు అంతా ఆర్టిజన్లే చేస్తున్నా.. తమ డిమాండ్లను పరిష్కరించే విషయంలో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా జహీరాబాద్, పటాన్‌చెరు, జోగిపేట, సంగారెడ్డి డివిజన్లు ఉండగా 568 మంది ఆర్టిజన్లు విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న విద్యుత్ బోర్డులో ఉన్న నిబంధనలనే అమలు చేస్తామని అప్పట్లో ప్రకటించారని, అయినా అమలు చేయక పోవడం వల్లే సమ్మె బాట పట్టాల్సి వస్తోందంటున్నారు. విధి నిర్వహణలో రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది మరణిస్తున్నా.. పట్టించుకోవడం లేదని, ఆర్థిక ఇబ్బందులతో పలువురు ఆత్మహత్యలకు సైతం పాల్పడినా న్యాయం జరగడం లేదని వారు వాపోతున్నారు. బోర్డు విభజన సందర్భంగా ఇస్తామని చెప్పిన వాటినే తాము అడుగుతున్నామని పేర్కొంటున్నారు. ఏపీఎస్ఈబీ రూల్స్‌ను అమలు చేయాలని, ఆర్టిజన్లు మరణిస్తే వారి సంతానానికి విద్యార్హతలను బట్టి ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఒకే సంస్థ అన్నప్పుడే ఒకే రూల్ ఉండాలని, ప్రస్తుతం పర్మినెంట్ వారికి ఒక విధానం, ఆర్టిజన్లకు ఒక చట్టం అమలు చేస్తున్నారని విమర్శిస్తున్నారు. సీనియారిటీని బట్టి బదిలీలు, ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు అమలు చేయాలని, ఇండస్ట్రీయల్ యాక్టు ప్రకారం పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఆర్టిజన్ కార్మికులను పర్మనెంట్ చేయడం ద్వారానే ఉద్యోగ భద్రత, ఆత్మగౌరవం లభిస్తుందంటున్నారు. నిరవధిక సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆర్టిజన్లు జిల్లా వ్యాప్తంగా ఆవిష్కరిస్తున్నారు. గోడలపై వాటిని అంటించి మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు.

తరచూ చోటు చేసుకుంటున్న ప్రమాదాలు

విద్యుత్ సంస్థలో వెట్టి చాకిరి చేయడానికే తాము పుట్టినట్లు ఉందని ఆర్టిజన్ కార్మికులు అంటున్నారు. అధికారుల నిర్లక్ష్యం, నాసిరకం సామగ్రి, బ్లేడ్స్ ఓపెన్ కాని ఎల్‌బీ స్విచ్‌ల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని వారు గుర్తు చేస్తున్నారు. ప్రమాదాలకు గురైన కార్మికులకు కాళ్లు, చేతులు తీసేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలువురు కరెంటు స్తంభాలపైనే ప్రాణాలు వదులుతున్నారని, పిల్లలు అనాథలు అవుతున్నారని వాపోతున్నారు. ఇంత కష్ట పడి పని చేస్తున్నా సంస్థలో తగిన గుర్తింపు లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పర్మినెంట్ కోసమే ఆందోళన



తమను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించి న్యాయం చేయాలనే డిమాండ్‌తో ఆందోళనకు వెళుతున్నాం. కరెంటు ఉత్పత్తి మొదలుకొని బిల్లుల వసూళ్ల వరకు అన్నీ ఆర్టిజన్ కార్మికులే చేస్తున్నా న్యాయం జరగడం లేదు. వివక్షతకు గురవుతున్నాం. పర్మినెంట్ చేయడం ద్వారానే ఉద్యోగ భద్రత, ఆత్మగౌరవం ఉంటుంది. బోర్డు విభజన సందర్భంగా ఇచ్చిన హామీల అమలునే కోరుతున్నాం. ఉద్యమానికి శాశ్వత ఉద్యోగులు కూడా సహకరించాలి.

– ఆయిదాల జైపాల్, తెలంగాణ విద్యుత్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకుడు

డీఎస్ఆర్ పద్ధతితో ప్రయోజనం

వ్యవసాయాధికారి రాజశేఖర్‌గౌడ్



డీఎస్ఆర్ విధానాన్ని పరిశీలిస్తున్న ఏఓ రాజశేఖర్‌గౌడ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): డీఎస్ఆర్ పద్ధతిలో అనేక ప్రయోజనాలు ఉన్నాయని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని చండూర్ గ్రామంలో పలువురు రైతులు సాగు చేస్తున్న డీఎస్ఆర్ పద్ధతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ రాజశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ.. సంప్రదాయంగా నాటే వరి పద్ధతి కంటే డైరెక్ట్ సీడెడ్ రైస్‌తో నీటి వినియోగం చాలా వరకు తగ్గుతుందన్నారు. నారు వేసే పద్ధతి ఉండకపోవడంతో, కూలీల శ్రమ తగ్గుతుంది. పైగా తక్కువ కాలంలో పంట చేతికి వస్తుంది. రసాయన ఎరువుల వినియోగం తక్కువగా ఉండడంతో నేల సారవంతమవుతుంది. ఈ పద్ధతి వాతావరణ మార్పులకు అనుగుణంగా ఉంటుంది. గ్రీన్‌హౌస్ వాయువులను తగ్గించడంతో పాటు, సాగు ఖర్చులను తగ్గిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ కృష్ణవేణి, రైతు శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చందాపూర్ గ్రామశివారులోని వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. వాటిలో నుంచి ఆయిల్, కాపర్ వైరు చోరీ చేశారు. సోమవారం రాత్రి ఈ ఘటన జరిగింది. మంగళవారం ఉదయం వ్యవసాయ పంట పొలాల వద్దకు వెళ్లిన రైతులు విషయం గమనించి ట్రాన్స్‌కో అధికారులకు ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసిన విషయం తెలిపారు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

రావి ఆకుపై వైఎస్సార్



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని పురస్కరించుకొని నారాయణఖేడ్‌కు చెందిన లీఫ్ ఆర్టిస్ట్ గుండు శివకుమార్ రావి ఆకులపై వైఎస్సార్ చిత్రాలను మలిచారు. అభిమానంతో రావి ఆకుపై ఆయనను చిత్రించానని పేర్కొన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అన్ని వర్గాల హృదయాల్లో పదిలంగా ఉన్న నేత అని కొనియాడారు.

– నారాయణఖేడ్‌

ఒంటరి మహిళలే టార్గెట్

- బెట్టింగ్ వ్యసనంతో చోరీలు
- ముగ్గురు దొంగల రిమాండ్
- రూ.6లక్షల విలువైన సొత్తు స్వాధీనం
- కేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ శ్రీనివాసరావు


స్వాధీనం చేసుకున్న సొత్తు చూపుతున్న ఎస్పీ

మెదక్ మున్సిపాలిటీ: బెట్టింగ్ వ్యసనాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడిన దొంగతో పాటు అతనికి సహకరించిన మరో ఇద్దరిని అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలు వెల్లడించారు. బెట్టింగ్ వ్యసనానికి బానిసైన మాసాయిపేట మండలం కొప్పులపల్లికి చెందిన బదనపురం పెంటయ్య అలియాస్ ప్రేమ్, తూప్రాన్ మండలం నాగులపల్లికి చెందిన కుమ్మరి శివకుమార్, ఇదే మండలం వట్టూరుకు చెందిన పాంబండ వరలక్ష్మిలతో కలిసి చోరీలకు పాల్పడుతున్నారు. కల్లు దుకాణాల్లోకి ఒంటరిగా వచ్చే మహిళలను టార్గెట్ చేసుకున్నారు. వారికి మాయ మాటలు చెప్పి బాగా కల్లు తాగిస్తారు. మత్తులోకి జారుకోగానే వాళ్ల దగ్గర ఉన్న బంగారం నగలు, వెండి కాళ్ల కడియాలను దోచుకొని వెళ్లేవారు.ఈ నేపథ్యంలో ఫిబ్రవరిలో హవేళిఘణాపూర్ మండలం కూచన్‌పల్లికి చెందిన ఎరుకల ఎల్లవ్వ మెదక్ పట్టణంలోని ఒకటవ నంబర్ కల్లు దుకాణంలోకి వచ్చింది. ఆమె వద్ద ఉన్న బంగారం నగలు, కాళ్ల కడియాలపై వీరి దృష్టి పడింది. ఆమెకు బాగా కల్లు తాగించి మత్తులోకి జారుకోగానే తులం బంగారు గుండ్లు, 1.5 తులాల బంగారు కమ్మలు, 60 తులాల వెండి కడియాలను దోచుకొని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో భాగంగా కుమ్మరి శివకుమార్ అదుపులోకి విచారించగా.. ఈ కేసులో వరలక్ష్మి, పెంటయ్యల ప్రమేయం ఉన్నట్లు తేలింది. నిందితులపై నర్సాపూర్, గజ్వేల్, మనోహరబాద్‌లలో కేసులు ఉన్నట్లు ఎస్పీ వివరించారు. ఈ మేరకు ముగ్గురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.6లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం వారిని రిమాండ్‌కు తరలించామన్నారు. కేసును ఛేదించిన మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, పట్టణ సీఐ మహేశ్, పోలీసు బృందం అమర్, నర్సింలు, నిఖిల్ తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మెదక్ అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీ ప్రసన్నకుమార్, పట్టణ సీఐ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం


చాకలి సురేఖ

నర్సాపూర్ రూరల్: ఓ యువతి అదృశ్యమైన సంఘటన నర్సాపూర్ మండలం అచ్చంపేటలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి ఆంజనేయులు కూతురు సురేఖ (19) పదో తరగతి పూర్తి చేసి ఇంట్లోనే ఉంటుంది. సోమవారం ఇంటి నుంచి వెళ్లి కనిపించకుండా పోయింది. చాకలి ఆంజనేయులు అతని భార్య పోచమ్మ, ఇద్దరు కుమారులు సురేఖను ఇంటి వద్ద ఉంచి 7వ తేదీ సోమవారం ఉదయం కూలి పనులకు వెళ్లారు. పనులు ముగించుకొని ఇంటికి వచ్చేసరికి సురేఖ ఇంటివద్ద లేదు. చుట్టుపక్కలతో పాటు బంధువుల వద్ద వెతికిన ఆచూకీ లభించ లేదు. ఇంట్లో ఉన్న రూ 15 వేలు తీసుకెళ్లినట్లు తెలిపారు. తల్లి పోచమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

జేబు దొంగకు దేహశుద్ధి


దొంగను చితకబాదుతున్న మహిళలు

నర్సాపూర్ రూరల్: జేబు దొంగను మహిళలు పట్టుకొని చితకబాదారు. ఈ సంఘటన నర్సాపూర్ బస్టాండ్‌లో మంగళవారం చోటుచేసుకుంది. నర్సాపూర్ బస్టాండ్‌లో ఓ వ్యక్తి తన ఇద్దరు కూతుర్లతో కలసి హైదరాబాద్‌కు వెళ్లే బస్సు ఎక్కుతున్నాడు. ఈ క్రమంలో జేబులో ఉన్న డబ్బులు కాజేసేందుకు ప్రయత్నిస్తున్న దుండగుడిని మహిళలు చూసి పట్టుకొని చితకబాదారు. పోలీసులకు సమాచారం ఇచ్చేలోపు అతను తప్పించుకొని పారిపోయాడు. తరచూ బస్టాండ్‌లో జేబుదొంగలు, డబ్బులతో పాటు బంగారు నగలు, సెల్‌ఫోన్లను అపహరిస్తున్న ఘటనలు ఇటీవల ఎక్కువయ్యాయని ప్రయాణికులు వాపోతున్నారు.

అథ్లెటిక్స్‌లో విద్యార్థినికి 6 గోల్డ్ మెడల్స్


విద్యార్థిని ప్రణీతను అభినందిస్తున్న ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): సిర్సనగండ్ల ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎర్రోళ్ల ప్రణీత అథ్లెటిక్స్ పోటీల్లో ఆరు గోల్డ్ మెడల్స్ సాధించారని ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జూన్ 4న, 29న జిల్లా స్థాయిలో నిర్వహించిన రన్నింగ్, బ్రాడ్ జంప్ పోటీలో నాలుగు గోల్డ్ మెడల్స్‌ను సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైందన్నారు. హైదరాబాద్‌లోని జింఖాన గ్రౌండ్స్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో 60 మీటర్ల రన్నింగ్, లాంగ్ జంప్ పోటీల్లో గోల్డ్ మెడల్స్ దక్కించుకుందన్నారు. ఈసందర్భంగా ప్రణీతను ఫిజికల్ డైరెక్టర్ ఉప్పలయ్యతో పాటు పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

పదిమంది పేకాట రాయుళ్ల అరెస్ట్

రూ.43 వేల నగదు, 9 సెల్ ఫోన్లు, 9 బైక్స్ స్వాధీనం


హుస్నాబాద్‌రూరల్: పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు, సెల్ ఫోన్స్

హుస్నాబాద్‌రూరల్: దేవేంద్రనగర్‌లో పేకాట ఆడుతున్న స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు మంగళవారం దాడి చేసి పది మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. కొద్ది రోజులుగా దేవేంద్రనగర్‌లోని పశువుల పాకలో పేకాట ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, హుస్నాబాద్ పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు. పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకోని వారి నుంచి రూ.43 వేల నగదు, 9 సెల్ ఫోన్స్, 9 బైక్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి



గజ్వేల్‌రూరల్: పేకాట ఆడుతున్న స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన మంగళవారం గజ్వేల్ మండలం కోమటిబండ గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఐదుగురు వ్యక్తులతో పాటు వారి వద్దనుంచి 9,700 నగదు, ఐదు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాలు, ఫామ్‌హౌస్‌లు, ఇండ్లు, బహిరంగ ప్రదేశాల్లో జూదం, ఇతర చట్టవ్యతిరేక కార్యక్రమాలను ఎవరైనా నిర్వహిస్తున్నట్లు సమాచారం అందితే వెంటనే టాస్క్‌ఫోర్స్ అధికారులకు (8712667445, 8712667446)కు సమాచారం అందించాలని సూచించారు.

సర్కార్ బడుల్లో మెరుగైన విద్య

డీఈఓ రాధాకిషన్

శివ్వంపేట(నర్సాపూర్): ప్రైవేట్ పాఠశాల కన్నా ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్యాబోధన జరుగుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని డీఈఓ రాధాకిషన్ కోరారు. మంగళవారం మండలంలోని పెద్దగొట్టిముక్కుల ఉన్నత పాఠశాలలో పేరెంట్, టీచర్ సమావేశానికి డీఈఓ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో శిక్షణ పొందిన అనుభవం ఉన్న ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందిస్తున్నారని చెప్పారు. ప్రైవేటుకు వెళ్లి ఆర్థికంగా నష్టపోవద్దని సూచించారు. విద్యార్థులను ప్రతిరోజు పాఠశాలకు పంపించాలని సూచించారు. విద్యార్థులు ఇప్పటి నుంచి లక్ష్యం నెరవేర్చుకునేందుకు ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బుచ్చానాయక్, హెచ్ఎం సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బర్త్ సర్టిఫికెట్ జాప్యం చేస్తున్నారని..

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నం


పెట్రోల్ పోసుకున్న శేఖర్

జహీరాబాద్ టౌన్: తన కుమారుడి బర్త్ సర్టిఫికెట్ జారీ చేయడంలో జాప్యం చేస్తున్నారని ఓ వ్యక్తి మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట హల్‌చల్ చేశాడు. మండలంలోని హోతి(బి) గ్రామానికి చెందిన బోయిని శేఖర్(35) తన కుమారుడు రాము బర్త్ సర్టిఫికెట్ కోసం మీ సేవలో దరఖాస్తు చేసుకున్నాడు. నెలలు గడుస్తున్నా సర్టిఫికెట్ జారీ చేయడం లేదని కోపంతో మద్యం తాగి పెట్రోల్ సీసాతో జహీరాబాద్ తహసీల్దార్ కార్యాలయానికి వచ్చాడు. ఎందుకు బర్త్ సర్టిఫికెట్ ఇవ్వడం లేదంటూ అధికారులను నిలదీశాడు. కార్యాలయం ఎదుట పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. అక్కడే ఉన్నవారు అడ్డుకుని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు స్టేషన్‌కు తీసుకెళ్లారు.

సర్టిఫికెట్ జారీ చేశాం

శేఖర్ కుమారుడి బర్త్ సర్టిఫికెట్ పెండింగ్‌లో లేదని తహసీల్దార్ దశరథ్ పేర్కొన్నారు. సర్టిఫికెట్ ఎప్పుడో జారీ చేశామని, మీ సేవలో ప్రింట్ తీసుకోవాల్సి ఉందన్నారు. మీ సేవకు వెళ్లకుండా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చాడని ఆయన పేర్కొన్నారు.

బీఎస్ఎన్ఎల్ ఆఫీసులో చోరీ

నర్సాపూర్: నర్సాపూర్‌లోని బీఎస్ఎన్ఎల్ ఆఫీసులో చోరీ జరిగిందని ఎస్ఐ లింగం చెప్పారు. ఆ సంస్థలో డిస్ట్రిబ్యూటర్‌గా పనిచేస్తున్న పూర్ణచందర్‌రెడ్డి ఈనెల 5న ఆఫీసుకు తాళం వేసి వెళ్లాడని, 7న ఉదయం తిరిగి ఆఫీసుకు వచ్చే సరికి తాళం పగులగొట్టి ఉంది. కౌంటర్‌లో ఉన్న రూ, 1500 ఎత్తుకు వెళ్లారు. పూర్ణచందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

టమాటా.. రైతులకు ఊరట

పెరుగుతున్న ధరలు

హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



జహీరాబాద్ టౌన్: నెల రోజుల వరకు టమాట పంట రైతులను ఆందోళనకు గురిచేసింది. బోరు బావులు, స్థానిక నీటి వనరులను వినియోగించుకొని సాగు చేసిన పంట చేతికి వచ్చే సమయానికి గిట్టుబాటు ధరలేక తీవ్రంగా నష్టపోయారు. టమాట తెంపిన కూలీలు, మార్కెట్‌కు తరలించేందుకు రవాణా చార్జీలకే సరిపోయింది. కమీషన్ ఏజెంట్ల వద్ద 25 కిలోల బాక్స్ రూ.100కు అమ్మాల్సి వచ్చింది. సంతలో కిలో రూ.10కు అమ్ముకున్నారు. కొన్ని రోజుల నుంచి టమాట ధరలు పెరుగుతుండటంతో రైతులు ఊరట చెందుతున్నారు.

ఆదుకుంటుందని యాసంగిలో సాగు చేసిన టమాట పంట వల్ల రైతులు నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. ధరలు పడిపోవడంతో పెట్టుబడులు కూడా రాలేదు. పంట దిగుబడి పెరగడంతో కొనేవారు కరువయ్యారు. వేల రూపాయల పెట్టిన పెట్టుబడి దక్కలేదు. జిల్లాలో సుమారు 537 ఎకరాల్లో టమాట పంట సాగవగ పడిపోయిన ధరల వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోవాల్సి వచ్చింది. జహీరాబాద్ మార్కెట్‌కు లోకల్ టమాటతో పాటు మహారాష్ట్ర నుంచి టమాట వస్తుంది. డిమాండ్ కన్నా దాదాపు రెట్టింపు రావడం వల్ల ధరలు పడిపోవడానికి కారణమవుతోంది. ఒక్కసారిగా పంట చేతికి రావడంతో ధరలు పతనమయ్యాయి. కూలీలు, రవాణా చార్జీలు మీదపడుతున్నాయని కొంత మంది రైతులు పంటను పొలంలోనే వదిలేశారు.

గిట్టుబాటు అవుతున్న ధరలు



కొన్ని రోజుల నుంచి టమాట ధరలు పెరుగుతున్నాయి. ఏప్రిల్, మే నెలలో నాటిన తోటల నుంచి కోతలు వస్తున్నాయి. ప్రస్తుతం సగం కోతలు పూర్తి చేశారు. అయితే దిగుబడి అంతంత మాత్రంగా ఉంది. ధర మాత్రం ఆశాజనకంగా ఉంది. ప్రస్తుతం బాక్స్ ధర రూ. 400 నుంచి రూ. 500 పలుకుతుంది. వారంతపు సంతలో టమాట కిలో రూ.40 నుంచి 50 అమ్ముతున్నారు. దిగుబడులు అధికంగా ఉన్నప్పుడు ధరలు లేక నష్టపోయామని, అరకొరగా పంట ఉన్నప్పుడు ధరలు పెరిగాయని కంబాలపల్లికి చెందిన రైతు శ్రీనివాస్ వాపోయారు. కొందరు మాత్రమే పెరిగిన ధరలు పొందుతారని ఆయన పేర్కొన్నారు.